# భ్రమ

గుడిపేవ
సుందర రామయ్య

తూర్పు దిక్కు క్రమేపీ ఎర్రబడుతోంది. అలసిపోయిన ప్రేమికుల్లా చెట్లు, తీగలు ఒళ్ళు విరుచుకొంటున్నాయి విల్లు లోంచి వెలువడ్డ బాణాల్లా పిట్టలు ఆకాశంలోకి దూసుకుపోతున్నాయి.

భాస్కరుని లేత కిరణాలు అగ్నిలో కాలుతున్న ఇనుపచువ్వల్లా మెల్లగా వ్యాపించసాగాయి.

ఆ కిరణాల వెలుగులో పాడుపడిన శివాలయం ఓ రాక్షసుని అస్థిపంజరంలా వుంది. ఆలయ మండపం మొండెం తెగిన మనిషిలా వుంది. దానిమీద పండుకొన్న ఓ ఆకారం గోడకు ఆనించుకొన్న బల్లిలా వుంది. సూర్య కిరణాల కాంతి ఆ స్త్రీ ఆకారమ్మీద పడ్తూ, కష్టాలతో కృంగి కృశించిన ఆమె శరీరానికి వింత మెరుపు నిస్తూంది. పీలికలై వ్రేలాడుతున్న ఆమె దుస్తులు పేదరికాన్ని గుర్తు చేస్తున్నాయి. వెండి దారాల్లా మెరిసిపోతున్న ఆమె చింపిరి జుట్టు, ఆమె వయస్సును, జీవితానుభవాన్ని చాటి చెప్తూంది. ప్రక్కనే పడివున్న ఊతకర్ర ఇంద్రజాలికుని మంత్రదండంలా వుంది.

ఆమె మెల్లగా కళ్లు విప్పింది. నెమ్మదిగా చేతులను నేలమీదికి ఆన్చి లేచి కూర్చుంది. అరిగిపోయిన గోళీల్లా మెరుస్తున్న కళ్ళతో చుట్టూ చూసింది. ఆమెకు కావాల్సిన దృశ్యం కన్పడలేదు కాబోలు ఊతకర్ర సాయంతో లేచి నిలబడింది. అడుగులో అడుగు వేసుకొంటూ మండపం మెట్లమీద నుండి క్రిందికి దిగింది. ఆ చుట్టుప్రక్కల ప్రదేశమంతా రాళ్ళురప్పలతోను పిచ్చి మొక్కల తోను నిండివుంది వెర్రితలలు వేస్తున్న ఆధునిక నాగరికతలా ఆ ముళ్ళచెట్లు అసహ్యాన్ని కల్గిస్తున్నాయి. తీరు తెన్నులేని సంసారాల్లా అస్తవ్యస్తంగా మొలకెత్తిన పిచ్చిమొక్కలు భయాన్ని కల్గిస్తున్నాయి

శక్తినంతా కూడదీసుకొని దారిని వెతుక్కొంటూ కోనేటి దగ్గరకు చేరుకొంది. దాదాపు సగానికి పైగా పూడిపోయిన ఆ కోనేరు తన శిధిలావస్థను చెప్పుకోటానికి సిగ్గుపడ్తున్నట్లు కన్పిస్తూంది. అందులో ఓ ప్రక్కగా నిల్వవుండిన నీటిమీద సూర్య కిరణాలుపడి చూపరులకు అది పచ్చగడ్డితో నేసిన పరుపులా కన్పిస్తూంది. ఆ కోనేటికి చుట్టూవున్న బండరాళ్ళు రాజులు వదిలేసి వెళ్ళిన సింహాసనాల్లా వున్నాయి. ఓ బండ రాయిమీద బాసింపట్టు వేసుకూర్చున్న కుర్రాడు తపస్విలా నిశ్చలంగా వున్నాడు. వయస్సు పది సంవత్సరాల లోపే. ఎర్రటి చాయ. జుట్టు చిందరవందరంగా ముఖమ్మీద పడివుంది. కళ్ళల్లో కన్పిస్తూంది. చురుకుదనం అంతకు మించిన పట్టుదల కూడా ద్యోతక మౌతూంది. శరీరానికి అంటిపెట్టుకొన్న చిరిగిన నిక్కరు. చాలీచాలని చొక్కా పేదరికానికి ప్రతినిధులుగా నిల్చాయి.

అతన్ని చూడగానే అవ్వ ముఖం విప్పారింది.

అడుగుల వేగాన్ని పెంచి అతన్ని

చేరుకొంది.

"ఏవిట్రా, రంగా! యియ్యాల పొద్దున్నే యీసు కూసున్నావే?" అంటూ అవ్వ పలకరించే సరికి రంగడి ముఖం ప్రక్కకు తిప్పుకొన్నాడు. వాడి ముఖంలో క్షణం పాటు వెలిగిన కోపాన్ని, చిరాకును గమనించింది అవ్వ.

"ఏమిట్రా! అలా వుండావే? నీక్కూడా వొంట్లో బాగాలేదా?" వాడి భుజమ్మీద చేయివేసి లాలనగా అడిగింది.

"నాక్కూడా బాగోపోతే మనకు బువ్వ ఎవరు తెత్తారు?"

"నేనే!" అంది అవ్వ బోసినోటితో నవ్వుతూ.

"నువ్వా?" ఆశ్చర్యంగా చూశాడు రంగడు.

"అవున్రా!"

"నీ వొంట్లో యిలావుంటే బువ్వ తేటానికి యెల్తావా?"

"ఇప్పుడు బాగానే వున్నానుగా! మరి వారం రోజుల్నుంచీ తొంగునే వున్నాను. ఆ మాయదారి జోరం తగ్గిపోయింది కనక నే నీకాడికి నడిసొచ్చాను "ఇక యిళ్ళమట నువ్వెళ్ళే పన్లేదురా!"

"అసలిలా ఎంత కాలం అడుక్కు తింటావవ్వా?"

"అదేవిట్రా అట్టాగంటావ్! మరి అడుక్కు తినకపోతే మనకు జీవనం ఎట్లాగడుత్తాది?"

"నేనేదైనా కూలిపని సేత్తా!"

"నువ్వా?" అంటూ ఆశ్చర్యంగా రంగడి ముఖంలోకి చూసి మరుక్షణమే వాణ్ణి హృదయానికి హత్తుకొంది.

"ఇంటింటికీ యెళ్ళి అడుక్కోవాలంటే సిగ్గౌవుందవ్వా! గుప్పెడుగింజలు యెయ్యకపోగా 'పోతులా వున్నావు. ఏదైనా పని సేసుకోరాదా' అని కసుక్కొంటున్నారు. అసలా ఆళ్ళతో ఎందుకు తిట్టించుకోవాలి! నేనిక యెళ్ళనవ్వా!" అన్నాడు రంగడు అవ్వ ఒళ్లో తలదాచుకొంటూ.

"దేశంలో అందరూ ధర్మాత్ములేవుండరు. చీటికి మాటికి చిరాకుపడి కసిరికొట్టేవోళ్ళు కూడా వుంటారు. ఆళ్ళేదో అన్నారని మనం బాధపడకూడదబ్బి!"

"నీకీ లోకం సంగతి తెలీదులే! నే నీ మధ్య ఓ రహస్యం తెల్సుకొన్నానవ్వే!"

"ఏమిట్రా అది?"

"నువ్వెళ్తే ఏ అమ్మయినాసరే మాటాడకుండా గింజలు పెట్టి పంపిత్తాది. మరి నేను ఏం పాపం సేసుకొన్నానో గాని ఒక్క తల్లికీ జాలిలేదు!"

ఆ మాటలు వినగానే అవ్వకు నవ్వాగలేదు.

"అది అంతేరా, పిచ్చినాన్నా!" అంటూ రంగడి పొడుగాటి జుట్టును సవరించింది.

"ఎందుకవ్వా?" ఉత్సాహంగా అడిగాడు రంగడు

"నువ్వు మగాడివి! నేను ఆడదాన్ని! అదే కారణం! ధర్మం సేసేవోళ్ళంతా ఆడోళ్ళే కాబట్టి యిళ్ళకాడ నాలుగు గింజలు దొరుకుతాయి!"

"ఆఁ...ఇప్పుడు తెలిసిందవ్వా అసలు యిషయం! నీకే కాదు! ఆ కుంటోడి కూతురి సుబ్బులు లేదూ! దానిక్కూడా ఎవ్వరైనా అడగ్గానే బువ్వపెడతారు. రెండు జాములు కాకముందే దాని గిన్నె నిండా గింజలు పడతాయి. ఎన్ని యిళ్లు తిరిగినా నా గిన్నెలో గుప్పెడు గింజలు కూడా పడవు. అసలు నేను కూడా ఆడదానిగా పుడితే బాగుండేది" విచారంగా అన్నాడు రంగడు.

"వద్దురా, అలా ఎన్నటికీ కోరుకోవద్దు! ఆడదానిగా పుట్టినందుకు నేనెన్ని కష్టాలు పడ్డానో ఆ దేవుడికే తెల్సు! నా కడుపున పుట్టినందుకు మీ అమ్మ కూడా సుకపడలేక పోయింది. మీ అయ్యేమో లారీ కింద పడి సచ్చిపోయాడు, నా యీ పాడు కళ్ళుండే

అయినవాళ్ళంతా సెదిరిపోయారు. అయినా దేముడు నాకింకా సావునివ్వలేదు," అవ్వ కన్నీళ్లు పెట్టుకొంది

"పెద్దవ్వా! నువ్వు సచ్చిపోగూడదు! నువ్వు సత్తే నేను కూడా సచ్చిపోతాను!" అంటూ బిక్కమొగం వేశాడు రంగడు.

"సావాలనుకొంటే గడియసేపు పట్టదు! ఎన్ని బాధలుపడినా నీ కోసమే బతుకుతున్నాన్రా! నిన్ను సూత్తుంటే మీ అమ్మను సూసినట్లే వుంటుంది!"

"నిజంగానా అవ్వా!"

"అవున్రా! మీ అమ్మ నీయంత వయస్సప్పుడు నీలానే వుండేది ఇప్పుడు నీకో రంగా, బాకెట్టు యేస్తే అచ్చు నా కూతురిలాగానే వుంటావ్" అంటూ రంగణ్ణి ఆప్యాయంగా ముద్దుపెట్టుకొంది.

రంగడి మనస్సులో ఏదో ఆలోచన మెరుపులా మెరిసింది.

"నువ్వేమి బెంగపడకవ్వా! కదలకుండా ఆ మండపంలోనే కూకో! రేతిరికూడా వన్నం తినలేదు నువ్వు! నేను యెంటనే యెళ్ళి ఓ ముద్ద సద్దన్నం పట్టుకొత్తాను!" అంటూ మెల్లిగా లేచి అవ్వకు చేయూతనిచ్చి మండపం దగ్గరకు నడిపించుకు వెళ్ళాడు.

పరిగిపోయి స్తంభానికి వ్రేలాడుతున్న మూటలోంచి ఓ గిన్నెను తీసి చేత పుచ్చుకున్నాడు రంగడు.

"నీ పిచ్చికాకపోతే యింత పొద్దున్నే వన్నం ఎవరు పెడ్తార్రా?" అంది అవ్వ మెల్లగా మండపమ్మీద నడుం వాల్చుతూ.

"వన్నం కాకపోతే గింజలు పెడ్తారు. గింజలుతెచ్చి చడాలమీద వన్నం వండేత్తా! ఆ దుంటోడికూతురు తిరిగివచ్చేలోపే నువ్వు వన్నం తినేలా సేత్తాను!" అంటూ గబ గబ మండపం మెట్లుదిగి ఉత్సాహంగా పరిగెత్తాడు రంగడు

* * *

"అవ్వా, అవ్వా! లే... ఘోరం జరిగిపోయింది." అంటూ సుబ్బులు లేపే సరికి అవ్వ తృళ్ళిపడి లేచింది

"మీ రంగణ్ణి పోలీసోళ్ళు తీసుకుపోతున్నారు.".

"అయ్యో ... అయ్యో! వాళ్ళ సేతులు పడిపోను! వాళ్ళ కేమొచ్చిందే?" అంటూ కంగారుగా ఊత కర్రను తీసుకొని లేచి నిలబడింది అవ్వ.

"ఏడున్నాడే .... నా రంగడు ఏడున్నాడే?" ఆత్రంగా అడిగింది

"ఆ సాకలోళ్ళ సెరువుకాడ పోలీసోళ్ళు పట్టుకొన్నారు"

"అయ్యో దేవుడా! ఎంతపని జరిగిందే! నువ్వు సెప్పేదంతా నిజమేనా పిల్లా?" అనుమానంగా అడిగింది.

"నిజమే నవ్వా! ఈ యిషయం నీకు సెబుతామని లగెత్తుకొచ్చాను. పాపం! రంగడు యెక్కి యెక్కి ఏడుత్తున్నాడు. తొరగా యెల్దాం రా!" అంటూ ముందుకు నడిచింది సుబ్బులు.

"అయ్యో రంగా! ఎలాగున్నావురా పిచ్చి తండ్రీ! ఇయ్యాల అడుక్కోటానికి నేను యెళ్ళినా యీ గోరం జరిగేది కాదు" అనుకొంటూ శక్తినంతా కూడదీసుకొని సుబ్బులు వెనుకే నడిచింది అవ్వ.

చాకలోళ్ళ చెరువు దగ్గర వాళ్ళకు రంగడు కన్పించలేదు. ఆ చెరువులో బట్టలు ఉతుకుతున్న ఓ ఆడది కన్పించింది. సుబ్బులు ఆమె దగ్గరకెళ్ళి "ఇందాకిక్కడ పోలీసోళ్ళుండాలి, ఏడకెళ్ళారు?" అని అడిగింది.

"ఏం? ఆ దొంగసచ్చినోడు మీ యింట్లో కూడా ఏదైనా ఎత్తుకొచ్చాడా?" అని అడిగింది బండమీద కసిగా చీరను బాదుతూ.

"కాదు వాళ్ళు ఏడకెళ్ళారు? ఆ పిల్లాడు

# నిరుద్యోగి నిస్పృహ

ఏడేడు ఆఫీసులు వెదికామయ్యా
ఏపట్టున జాబులు లేవే లేవయ్యా
అరికాలి చెప్పులు అరిగాయి సామీ
ఒడలి నొప్పులు పెరిగాయి సామి
ఇంత చదివిన చదువులకు అర్థమేమిటయ్యా
పొట్టకూటికి గడవని చదువులెందుకయ్యా
ఆ(క)ల్లో లక్ష్మణా అంటు ఆలుబిడ్డ లేడ్వగా ॥ఏడేడు॥
లంచగొండితనము పేట్రేగి పోయెనయ్యా
దేశమంతా అవినీతి పాలయ్యేనయ్యా
ఐదు పదులు దరఖాస్తు పారేసినా సామి
రాను పోను రైళ్ళకు యాభై దాటె సామి
మాయదారి ఇంట్రోవ్యూ మరో సవాలాగేనయ్యా
అప్పెంతచేసి ఇంటర్వ్యూకెళ్లిన లాభమేమిటయ్యా
అప్పు తిప్పు ముప్పేమనకు మిగిలింది చివరకయ్యా? ॥ఏడేడు॥
ఎంప్లాయిమెంటు బ్యూరోలోన సంచకారమెంత జరుగునయ్యా
ఎస్టాబ్లిష్మెంటు ఆఫీసులో ఎంతెంతం దక్షిణాలే దక్కునయ్యా
ఉద్యోగానుభవం వుండీ తీరాలంటారు సామి
ఉద్యోగంలేక అనుభవము ఎట్లావస్తుందిరా సామి
నిరుద్యోగ భృత్యం యిస్తానని ప్రభుత్వమంటుందయ్యా
ఆయువు తీరేసరికన్నా అది ఆయనలో కొస్తుందయ్యా? ॥ఏడేడు॥

—పి. యమ్. యమ్. ఆచార్య

ఎందీ?" ఆయాసపడ్తూ అడిగింది అవ్వ.

"ఇంకేడ తెల్కారు, పోలీసు స్టేషన్ కాడికి!"

"అసలేం జరిగిందమ్మా?" అవ్వ అడిగింది.

"ఇంకేం జరగాలి? ఆ కుర్ర సచ్చినోడు గలుసిడ ఆరేసిన లంగాలు, జాకెట్లు పుచ్చుకొని పారిపోతుంటె నేను గోల చేశాను. సహాయానికి ఆ దారిన పోతున్న పోలీసోళ్లు అడ్డగట్టుకొన్నారు పైగా ఆ బట్టలు ఎవరివో తెలుసా సర్కిల్ యిన్స్పెక్టరు గారి పెద్ద అమ్మాయివి. అయినా ఆ సచ్చినోడికి ఆ దొంగ బట్టలే ఎందుకు అవసరమొచ్చాయో?..." ఇంకా ఏమిటేమిటో చెప్పుకు పోతూంది.

కాని ఆ మాటలేవీ వినిపించుకోకుండా అవ్వ భారంగా అడుగులు వేస్తూ పోలీసు స్టేషన్ వైపు నడిచింది.

★